క్లుప్తంగా

రేగడగూడురులో హిందూ ధర్మ ప్రచారం

వెలుగోడు: మండల పరిధిలోని రేగడగూడురు గ్రామంలో త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల శిష్యులు మంగళవారం హిందూ ధర్మ ప్రచారాన్ని నిర్వహించారు. త్రైత సిద్ధాంత భగవద్గీత ఆధ్యాత్మిక గ్రంథాలను ఇంటింటా పరిచయం చేశారు. ఈ సందర్భంగా త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక చింతల పల్లి కమిటీ అధ్యక్షులు రామచంద్రుడు మాట్లాడుతూ.. భగవద్గీత జ్ఞానం ద్వారా కర్మ విధానం తెలుసుకొని యోగం ఆచరించి మోక్షం పొందాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గోకారి, కుమార్ ఆచారి, పుల్లా రెడ్డి, సంజీవ, నాగమద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

నాగలూటిలో 24 గంటల వైద్య శిబిరం


భక్తులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మకూరు: మండలంలోని నాగలూటి పుణ్య క్షేత్రంలో 24 గంటలు వైద్య సేవలను అందించేలా ఏర్పాటు చేసినట్లు మండల వైద్యాధికారి పవన్‌కుమార్, గోపాల్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ కాలినడకన వెళ్లే భక్తులకు, శివస్వాములకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కాళ్లనొప్పులు, జ్వరాలు, బీపీ, షుగర్ లాంటి పరీక్షలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి రోజు 2 నుంచి 3 వేల మందికి పైగా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ప్రవీణ్, విశ్వనాథ్, తదితరులుపాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలను సరిచేయించాలి

జూపాడుబంగ్లా: నందికొట్కూరు పట్టణంలోని బైరెడ్డినగర్‌లోని సీపీఎం కొట్టాలల్లో కూలేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాలను సరిచేయించాలని సీపీఎం అధ్వర్యంలో కాలనీ వాసులు మంగళవారం ట్రాన్స్‌కో ఏఈడీ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. సీఐటీయూ నాయకుడు గోపాలకృష్ణ, వెంకటేశ్వర్లు, భాస్కర్, పక్కీర్‌సాహెబ్ మాట్లాడుతూ 15 ఏళ్ల నుంచి గుడిసెలు ఏర్పాటు చేసుకొని ప్రజలు జీవిస్తున్నారని తెలిపారు. గుడిసెల కోసం ఏర్పాటుచేసిన విద్యుత్ స్తంభాలు నేల కొరిగి తీగలు చేతికందేంత ఎత్తులో ప్రమాదకరంగా వేలాడుతున్నాయని చెప్పారు. అనంతరం ట్రాన్స్‌కో ఏడీఈ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు 836 మంది ఓటర్లు

కొత్తపల్లి: మార్చి 13న జరిగబోయే గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు మండలంలో 836 మంది ఓటర్లు ఉన్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ మంగళవారం తెలిపారు. ఇందులో 800 మంది పట్టభద్రులు, 36 మంది ఉపాధ్యాయులు ఉన్నారని చెప్పారు. వీరితో పాటుగా జెడ్పీటీసీ సభ్యుడు, 9 మంది ఎంపీటీసీ సభ్యులు ఈ ఎన్నికలలో వారి ఓటుహక్కును వినియోగించుకోవచ్చని వెల్లడించారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే ఈనెల 18 లోపు తహసీల్దార్ కేంద్రంలో సంప్రదించి సరిచేసుకోవచ్చని తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

పగిడ్యాల: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మంగళవారం స్థానిక ఆదర్శ పాఠశాల నుంచి బీరవోలు ఆరోగ్య ఉపకేంద్రం వరకు వైద్యాధికారి మోహన్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ యోగా, జుంబా, సైక్లింగ్ తదితర వ్యాయామాలను పాటించాలన్నారు. రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారని వివరించారు. అనంతరం ఆదర్శ పాఠశాలలో స్కూల్ హెల్త్ స్క్రీనింగ్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు.

ఎదురుపాడులో కొవ్వొత్తుల ర్యాలీ

కొత్తపల్లి: 2019 సంవత్సరం ఫిబ్రవరి 14న పుల్వామాలో ఆర్మీ జవాన్లపై ఉగ్రదాడి జరిగింది. ఆ దాడిలో వీరమరణం పొందిన జవాన్లకు నివాళిగా మండలంలోని ఎదురుపాడు గ్రామంలో పిల్లలు, యువకులు మంగళవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కొవ్వొత్తులతో గ్రామంలోని వీధి, వీధి తిరుగుతూ వీరజవాన్లకు జోహర్లు, జైభారత్, జై జవాన్ నినాదాలు చేశారు.

వ్యవసాయానికి విద్యుత్ వేళల్లో మార్పు

పగిడ్యాల/మిడుతూరు/జూపాడుబంగ్లా: వ్యవసాయ కనెక్షన్లకు బుధవారం సరఫరా చేసే విద్యుత్ వేళల్లో స్వల్ప మార్పులు చేసినట్లు ఏఈలు క్రాంతికుమార్, రామాచారి మంగళవారం తెలిపారు. నందికొట్కూరు 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నందున ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు మార్పు గమనించాలని, తిరిగి రాత్రి వ్యవసాయ కనెక్షన్‌లకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని ఏఈ వెల్లడి చేశారు.

అన్నదానం.. పుణ్యకార్యం

"అన్నదస్య మనుష్యస్య
బలమోజో ధనాని చ,
కీర్తిశ్చ వర్ధతే శశ్వత్ త్రిషు
లోకేషు పాండవ"

అన్నదానం చేసినవారికి బలం, ఓజస్సు, ధనం, ముల్లోకాలలో శాశ్వత కీర్తి లభిస్తాయని అగ్నిపురాణం చెబుతోంది. అంతే కాక అన్నపూర్ణార్చన చేసిన వారి అన్నమయకోశం శుద్ధమై సాధనామార్గంలో పురోగతిని సాధిస్తారట.

- శ్రీశైల పాదయాత్రికుల కోసం అడుగడుగునా అన్నదాన శిబిరాలు
- నల్లమలలో ఐదు చోట్ల, ఉమ్మడి జిల్లాల్లో పలు చోట్ల ఏర్పాటు
- ప్రతి రోజు లక్షలాది మంది భక్తులకు అన్నప్రసాద వితరణ


నాగలూటి క్షేత్రంలో రాత్రి వేళ కొనసాగుతున్న అన్నదాన కార్యక్రమం


వెంకటాపురం గ్రామంలో అన్నదానంలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూరు: అన్నం పరబ్రహ్మస్వరూపం. అన్ని దానాల కంటే అన్నదానం మిన్న. అన్నదానం చేస్తే సర్వపాపాలు తొలగి పుణ్యం లభిస్తుంది. అన్నదాన కార్యక్రమం తొలిసారిగా శ్రీశైలమహాక్షేత్రంలోనే ప్రారంభమైనట్లు కరివేన బ్రాహ్మణులు పేర్కొంటున్నారు. సుమారు 400 సంవత్సరాల నుంచి అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. శివరాత్రికి వచ్చిన భక్తులకు బ్రాహ్మణులు ఉచితంగా భోజనం వడ్డించేవారట, ఆ భోజనాలే నేడు అన్నదాన కార్యక్రమాలుగా వర్ధిల్లుతున్నాయి. శ్రీశైలక్షేత్రంలో ప్రారంభమైన అన్నదాన కార్యక్రమాలు నేడు దేశంలోని వివిధ పవిత్ర క్షేత్రాలలో కొనసాగుతున్నాయి. పవిత్రమైన అన్నదాన కార్యక్రమాలు మహాశివరాత్రి పర్వదినాల సందర్భంగా పాదయాత్రగా వెళ్లే భక్తుల కోసం నల్లమల అటవీ ప్రాంతంలో పలు చోట్ల వర్ధిల్లుతున్నాయి.

నల్లమలలో అన్నదాన కార్యక్రమాలు

శ్రీశైలమహాక్షేత్రంలో 1994 లో శివదీక్షలు ప్రారంభమయ్యాయి. ఆ సమయంలో మాల ధారణ చేసిన శివస్వాములు, వారి గ్రామాల నుంచి పాదయాత్రగా బయల్దేరి శ్రీశైలమహాక్షేత్రానికి చేరుకునేవారు. అప్పట్లో రెండు, మూడుసంవత్సరాల పాటు ఎలాంటి అన్నదాన కార్యక్రమాలు లేకపోవడంతో ఆకలిదప్పులకు ఇబ్బంది పడేవారు. అప్పట్లో మాలధారణ వేసిన శివస్వాములే నేడు నల్లమలలోని ప్రధాన కూడళ్లలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తులు, శివస్వాముల మన్నలను పొందుతున్నారు.

వెంకటాపురంలో 25 ఏళ్లుగా అన్నదానం

శివస్వాముల పాదయాత్ర ప్రారంభమయ్యే వెంకటాపురం గ్రామంలోని శ్రీమల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శివభక్తులకు, శివ మాలధారులకు 25 సంవత్సరాలుగా అన్నదాన కార్యక్రమాలను నిర్విరామంగా కొనసాగిస్తున్నారు. వరుసగా రెండవ ఏడాదినూతన భవన సముదాయంలో శివస్వాములకు అన్నదానాన్ని బఫే సిస్టమ్‌లో నిర్వహిస్తున్నారు.

నాగలూటి వీరభద్రస్వామి క్షేత్రం వద్ద

నాగలూటి వీరభద్రస్వామి క్షేత్రం వద్ద పెద్దదేవులాపురం గ్రామానికి చెందిన బాలవెంకటరెడ్డి అనే శివస్వామి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. 23 సంవత్సరాలుగా ఇక్కడ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆయన మరణించడంతో ఆయన కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఇక్కడ అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రతిఏటా దాదాపు లక్షమందికి పైగానే ఇక్కడ భిక్ష ను స్వీకరిస్తున్నారు.

పెచ్చెర్వులో..

పెచ్చెర్వు వద్ద గూడూరుకు చెందిన శ్రీవీరభద్రస్వామి దేవస్థాన అన్నదాన కమిటీ నిర్వాహకులు 24 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దాదాపు 2 లక్షల మంది వరకు భక్తులు ఇక్కడ అన్నప్రసాదం స్వీకరిస్తున్నారు. ఫిబ్రవరి 18 మధ్యాహ్నం వరకు పెచ్చెర్వు గూడెం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తారు.

కైలాసద్వారం

కైలాసద్వారం వద్ద పత్తి కొండ కు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మురళీధర్‌రెడ్డి అనే శివభక్తుడు అన్నదాన కార్యక్రమాన్ని 22 సంవత్సరాలుకు పైగా నిర్వహిస్తున్నారు. కాలినడకన కైలాసద్వారం చేరుకున్న భక్తులు ఇక్కడ భిక్ష స్వీకరించి శ్రీశైలమహాక్షేత్రానికి తరలివెళ్తున్నారు.

మరికొన్ని చోట్ల..

ఇలా నల్లమల అటవీమార్గం నుంచి భక్తులకు హఠకేశ్వరం వద్ద, ఆత్మకూరు మండలం కరివేన, రాధాపురం, అమలాపురం, వెలుగోడు, పాములపాడు, జూపాడుబంగ్లా, నందికొట్కూరు, వెంకాయపల్లె ఎల్లమ్మ, కర్నూలు నగర సమీపంతో పాటు జిల్లాలోని నలుమూలల అన్నదాన కార్యక్రమాలను భక్తులు నిర్వహిస్తున్నారు.

శివప్రసాదంగా భావిస్తున్నాం



బళ్లా రిజిల్లాలోని వేణీవీరాపురం గ్రామం నేను వరుసగా 5 సంవత్సరాలుగా శ్రీశైల మహాక్షేత్రానికి కాలినడకన వెళ్తున్నాను. నల్లమలలో వెలిసిన అన్నదాన కార్యక్రమాలలో నేను భిక్ష స్వీకరించి అది శివప్రసాదంగా భావిస్తున్నా. 8 రోజులుగా కాలినడకన ప్రయాణించి హాళహరి, దేవలకొండ, నందికొట్కూరు, ఆత్మకూరు, కరివేన, నాగలూటి అన్నదాన శిబిరాల్లో భిక్ష స్వీకరించా. కొండ కోనల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయం.
– బ్రహ్మయ్య, దేవమ్మఅవ్వ అర్చకులు, వేణీవీరాపురం, బళ్లారిజిల్లా

అన్నదాన కార్యక్రమాలే శివభక్తులకు అండ



మాది మహానంది మండలం అబ్బీపురం. శివమాలధారణ చేసి శ్రీశైలానికి వెళ్తున్నా. కాలినడకన వస్తున్న శివస్వాములందరికి ఉచిత భోజన శిబిరాలు ఎంతగానో ఊరటనిస్తున్నాయి. వ్యయప్రయాసలతో వచ్చే శివభక్తులకు ఆకలిని తీరుస్తూ రక్షణ శిబిరాలుగా మారాయి. – శరబారెడ్డి, అబ్బీపురం

25 సంవత్సరాలుగా అన్నదాన కార్యక్రమం



మా గ్రామంలోని శ్రీమల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో 25 సంవత్సరాలుగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. లక్షలాది మంది తరలివచ్చి అన్నదాన కార్యక్రమంలో పాల్గొంటున్నారు. శివరాత్రి కంటే 10 రోజులు ముందుగానే భోజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శివస్వాములకు భోజనంతో పాటూ అల్పాహారాన్ని అందిస్తున్నాం. – నాగిరెడ్డి, వెంకటాపురం

యోగా, సైక్లింగ్‌తో ఆరోగ్యం


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయిలు, వైద్యసిబ్బంది

జూపాడుబంగ్లా: విద్యార్థులు నిత్యం యోగా, సైక్లింగ్ వంటి వ్యాయామాలు చేయటం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని కొణిదేల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం సెల్వియారేచల్, మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు గౌసియాబేగం, నీలిమ తెలిపారు. మంగళవారం ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి నిత్యం 4 గంటలకే నిద్రలేచి గంటపాటు వాకింగ్, జాగింగ్, సైక్లింగ్, యోగా వంటి వ్యాయామాలు చేయటం వల్ల శరీర అవయావల్లో రక్తప్రసరణ పెరిగి మెదడు ప్రేరణశక్తి పెరుగుతుందని తెలిపారు. అలాగే శరీర ధృఢత్వం, పటుత్వం పెరుగుతుందన్నారు. అనంతరం యోగాసానాలు వేయించారు. కార్యక్రమంలో పీఈటీ శ్రీనాథ్, ఉపాధ్యాయులు నీరజ, రఫి, శ్రీనివాసరెడ్డి, ఎల్లన్న పాల్గొన్నారు.

19 నుంచి రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శిల్పా భువనేశ్వరరెడ్డి, నాయకులు

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానందిలో ఈ నెల 19వ తేదీ నుంచి రాష్ట్రస్థాయి ఎడ్లబలప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం మహానందిలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సీనియర్స్ విభాగంలో మొదటి బహుమతిగా రూ. 1.25లక్షలను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అందిస్తున్నారన్నారు. ఆ తరువాతి స్థానాల్లో వరుసగా రూ. 80వేలు, రూ. 60వేలు, రూ. 40వేలు, రూ. 30వేలు బహుమతులు ఉంటాయన్నారు. సబ్‌జూనియర్స్ విభాగంలో వరుసగా రూ. 75వేలు, రూ. 60వేలు, రూ. 50వేలు, రూ. 40వేలు, రూ. 30వేలు, న్యూకేటగిరీ విభాగంలో రూ. 60వేలు, రూ. 50వేలు, రూ. 40వేలు, రూ. 30వేలు, రూ. 20వేలు బహుమతులు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ రాష్ట్ర డైరెక్టర్ బసిరెడ్డి నాగభూపాల్‌రెడ్డి, మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్, కన్వీనర్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి, గాజులపల్లె కొండా మధుసూధన్‌రెడ్డి, గోపవరం సర్పంచ్ వంకె సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

గోనెసంచుల పంపిణీకి చర్యలు

మిడుతూరు: మార్క్‌ఫెడ్ (మిడుతూరు మండల సమాఖ్య) ద్వారా 2020 -21 ఖరీఫ్ సీజన్‌లో కొనుగోలు చేసిన మొక్కజొన్నలకు సంబంధించిన గోనెసంచులను తలముడిపి రైతులకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ తెలిపారు. మంగళవారం తన చాంబర్‌లో తలముడిపి సర్పంచ్ వెంకటేశ్వర్లు, వెలుగు ఏపీఎం కల్పలత, మండల సమాఖ్య సభ్యులతో తలముడిపి రైతులకు సంబంధించిన ఖాళీ గోనెసంచుల పంపిణీపై మాట్లాడారు. ఏపీఎం కల్పలత మాట్లాడుతూ మార్క్‌ఫెడ్ ద్వారా (మండల సమాఖ్య, గ్రామ ఐక్య సంఘాలు ఆధ్వర్యంలో) 2020 ఖరీఫ్ సీజన్‌లో 9 గ్రామ ఐక్య సంఘాలలో కొనుగోలు చేశామని, వాటిని ఆ గ్రామాలకు సంబంధించిన బుక్ కీపర్ల ద్వారా రైతులకు అందజేసి సంతకాలు తీసుకున్నామని వివరించారు. కాగా మార్క్‌ఫెడ్ నుంచి కొంత మేర సంచులు రాలేదని వచ్చిన వెంటనే బుక్‌కీపర్లకు అప్పగించి పంపిణీ చేశామని చెప్పారు. దీంతో స్పందించిన ఎంపీపీ 9 గ్రామాలల్లో కొనుగోలు సంబంధించిన గోనెసంచులను రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ స్వామన్న, వెలుగు సీసీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారుల విస్తరణ

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో ప్రధాన రహదారి విస్తరణ పనులను మంగళవారం జెడ్పీటీసీ జ్యోతి రామలింగేశ్వరరెడ్డి, సర్పంచు వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య ఆధ్వర్యంలో చేపట్టారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన నిధులతో డ్రైనేజీ పనులు చేపట్టామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, రహిమాన్, రహీంబాషా పాల్గొన్నారు.

మల్లన్న సేవలో ఆర్టీసీ ఎండీ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను ఏపీఎస్ ఆర్టీసీ (ప్రజా రవాణ శాఖ) ఎండీ ద్వారక తిరుమలరావు దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద అధికారులు, అర్చకులు ఆలయమర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకున్నారు. అనంతరం శ్రీశైలం ఆర్టీసీ బస్టాండ్‌ను ఎండీ సందర్శించారు. శ్రీశైలంలో ఆర్టీసీ డిపోను ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ నాయకులు నాగిరెడ్డి ,ఓబులయ్య ఎండీని కోరారు. కాగా ఇప్పటికే డిపో ఏర్పాటుకు స్థలం కావాలని ఇరిగేషన్‌శాఖ అధికారులను కోరినట్లు ఎండీ తెలిపారు.

రూ. 5.89లక్షల ఎరువుల అమ్మకాల నిలిపివేత

మహానంది: గాజులపల్లెలోని గఫారియా ఎరువుల దుకాణంలో ఎరువుల అమ్మకాలు నిలిపివేయాలని ఏఓ నాగేశ్వరరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. ఏఓ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ అమ్మకం రికార్డులు, ఫారం ఓ అనుమతులు లేనందున రూ. 5.89లక్షల విలువ చేసే 32.65 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశామన్నారు.

ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య

ఆత్మకూరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నామని, ప్రతి ఒక్కరూ తమ కళాశాలలోనే చేరాలని ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటనరసయ్య కోరారు. పట్టణంలోని ప్రభుత్వ, ఆదిత్య జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సౌకర్యాలపై అవగాహన సమావేశం నిర్వహించారు.

సంజీవయ్యను ఆదర్శంగా తీసుకోవాలి

జూపాడుబంగ్లా: ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్యను నేటి రాజకీయ నాయకులు, యువత ఆదర్శంగా తీసుకోవాలని మాలమహానాడు నాయకులు శివప్రసాద్, వాడాల శేషు అన్నారు. మంగళవారం సంజీవయ్య జయంతిని పురస్కరించుకొని నందికొట్కూరు పట్టణంలోని మాలమహానాడు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పుల్లయ్య, సుబ్బన్న, అయ్యన్న, భూషన్న తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ ఏర్పాట్ల పరిశీలన


అన్నదాన భవనంలో వంటకాలను పరిశీలిస్తున్న ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారిచక్రపాణిరెడ్డి

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం దేవస్థానం కలిపించిన ఏర్పాట్లును శ్రీశైలదేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారిచక్రపాణిరెడ్డి పరిశీలించారు. మంగళవారం ధర్మకర్తల మండలి సభ్యులు మధుసూధన్‌రెడ్డితో కలిసి చంద్రావతి కల్యాణ మండపం, అన్నప్రసాద వితరణ, పారిశుద్ధ్య ఏర్పాట్లు తదితర వాటిని పరిశీలించారు. ముందుగా అన్నదాన భవనంలోని అన్నదాన ప్రదేశాలు , భక్తులు వేచి ఉండే గదులు వంటశాల తదితర వాటిని సందర్శించారు. అన్నదాన భవనంలో ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

సీసీ రహదారుల నిర్మాణం


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్

పాములపాడు: మండలంలోని బానకచెర్ల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో సీసీ రహదారుల నిర్మాణ పనులను సర్పంచు ఆవుల జయసుధ మంగళవారం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన రోజునే ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ముస్లిం మైనార్టీ కాలనీలో సీసీ రహదారుల నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందన్నారు. రూ.20లక్షలతో పనులు చేపట్టామన్నారు. ప్రస్తుతం దాదాపు 300 మీటర్ల మేర 3 కాలనీల్లో పనులు చేపట్టామని చెప్పారు. దాదాపు రూ.30లక్షల మేర ఖర్చు అయ్యే అవకాశం ఉందని, నిధులు తక్కువగా ఉన్న రోడ్డు పనులను సొంత ఖర్చులతో నైనా సరే పూర్తి చేయిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోమేసా చైర్మన్ ఆవుల వెంకటనారాయణరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సైన్స్‌ఫేర్‌లో జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థినుల ప్రతిభ



డీఈఓ నుంచి జ్ఞాపిక అందుకుంటున్న వై. కవిత, గణిత ఉపాధ్యాయుడు ఎస్. రాజశేఖరరెడ్డి

మిడుతూరు: నంద్యాల జిల్లా ఎస్‌పీజీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్‌లో మిడుతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని వై. కవిత గణితం మోడలింగ్ ప్రాజెక్టు ప్రదర్శనలో జిల్లా స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచినట్లు హెచ్ఎం శివజ్యోతి తెలిపారు. డీఈఓ అనురాధ చేతులమీదుగా మెమోంటో అందుకుందని చెప్పారు. కవిత బృందంలో అరీఫా, ముర్తుజాబీ ఉన్నారన్నారు. విద్యార్థినులకు గణిత ఉపాధ్యాయుడు సిరిగిరి రాజశేఖరరెడ్డి అభినందించారు.

లిటిల్ ఏంజిల్స్ విద్యార్థుల ప్రతిభ

వెలుగోడు: పట్టణంలోని లిటిల్ ఏంజిల్స్ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ కనబరిచారు. విద్యార్థినులు యశ్వంతి, సునైనా, తబుసమ్, వాణి శ్రీలు గ్లోబర్ వార్మింగ్ ప్రాజెక్ట్ పర్యావరణం, వాతావరణం అంశంలో రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల విభాగంలో 3వ బహుమతి సాధించారు. అలాగే ఎకో ఫ్రెండ్లీ విభాగంలో జిల్లా స్థాయి కన్సోలేషన్ బహుమతి లభించింది. ఉపాధ్యాయులు రవిశంకర్, కామేశ్వరరావు, అనిల్, ప్రకాశ్ విద్యార్థులను కరస్పాండెంట్ ఎంఎఫ్ ఇమ్మానుయేలు, హెచ్ఎం ప్రశాంతి అభినందించారు.


మయూర వాహనం ఆలయ ప్రదక్షిణను ప్రారంభిస్తున్న చైర్మన్ రెడ్డివారిచక్రపాణిరెడ్డి

శంభో..శివ శంభో


ఉత్సవంలో కళాకారుల ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాల్గవరోజు మంగళవారం స్వామి, అమ్మవారు మయూర వాహనంపై ఊరేగారు. శ్రీశైలానికి భక్తులు పోటెత్తారు. భక్తుల శివనామస్మరణతో ఇలకైలాసం మోరుమోగింది. ఉత్సవాల్లో కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


ఉత్సవాన్ని తిలకించేందుకు భారీగా తరలివచ్చిన భక్తజనం,(ఇన్‌సెట్)డోలుకళాకారుల విన్యాసాలు

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కండి

- వాడీవేడిగా సర్వసభ్య సమావేశం
- గోనెసంచుల పంపిణీపై సభ్యుల నిలదీత



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యులు పర్వత యుగంధర్‌రెడ్డి

మిడుతూరు: సమస్యల పరిష్కారానికి కృషిచేసి గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ భవనంలో ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో 2021 సంవత్సరంలో మొక్కజొన్నలు విక్రయించిన రైతులకు గోనెసంచుల పంపిణీ, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద చేపట్టనున్న పనులపై వాడీవేడీ చర్చ జరిగింది.

జాప్యంపై ఎందుకు చర్యలు తీసుకోలేదు?

2020 నవంబర్ , డిసెంబర్ ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్నలు కొనుగోలు చేసిన నందికొట్కూరు మార్కెట్ యార్డ్, సహకార సొసైటీ, మార్క్‌ఫెడ్ రైతులకు గోనెసంచులు ఇవ్వకుండా రెండేళ్లకుపైగా జాప్యం జరిగినా ఎందుకు చర్యలు తీసుకోలేదని తలముడిపి సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ స్వామన్న వ్యవసాయాధికారి పీరునాయక్‌ను నిలదీశారు. గోనెసంచులను నందికొట్కూరు మార్కెట్ యార్డు, నందికొట్కూరు సహకార సొసైటీ. మార్క్‌ఫెడ్ వారి ఆధ్వర్యంలో కొనుగోలు చేశారని, వ్యవసాయ శాఖకు ఎలాంటి సంబంధం లేదని ఏఓ తేల్చిచెప్పారు. ప్రస్తుతం శనగలను రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం మద్దతు ధరతో క్వింటా రూ.5,335లతో ఈ నెల 23వ తేదీ నుంచి కొనుగోలు చేస్తామని చెప్పారు.

ఉపాధి పనులు రైతులకు ఉపయోగపడటం లేదు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు చేపడుతున్నారని, ఆ పనులు రైతులకు ఏ విధంగా ఉపయోగపడటం లేదని సహకారసొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డి, సర్పంచ్‌లు నాగస్వామిరెడ్డి, ఫణిభూషన్‌రెడ్డి అన్నారు. ఉపాధి పనులు గుర్తించిన సమయంలో గ్రామ సభల నిర్వహణకు ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా ఇష్టానుసారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి మీ ప్రవర్తన మార్చుకోకపోతే చర్యలు తప్పవని ఉపాధి సిబ్బందిని హెచ్చరించారు.

రహదారులు త్వరగా పూర్తిచేయాలి

మిడుతూరు ఎంపీడీఓ కార్యాలయం నుంచి బస్టాండు వరకు, నంద్యాల – నందికొట్కూరు రహదారి, మిడుతూరు – గార్గేయపురం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ పర్వత యుగంధర్‌రెడ్డి , సహకార సొసైటీ అధ్యక్షుడు తులసిరెడ్డి ఆర్‌అండ్‌బీ ఏఈకి సూచించారు. అలాగే మాసపేట – 49 బన్నూరు, మిడుతూరు – వీపనగండ్ల వరకు పంచాయతీ రాజ్ కింద లింక్ రహదారులకు మంజూరుకు ప్రతిపాదనలు పంపాలని పీఆర్ ఏఈ ప్రతాపరెడ్డికి సూచించారు. ఇంకా పలు సమస్యలపై ప్రజాప్రతినిధులు గళం విప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రవణమ్మ, వైస్ ఎంపీపీ నబిరసూల్ తదితరులు పాల్గొన్నారు.